కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 21 జనవరి 2026

## పరీక్షలను ఇష్టంతో సిద్ధం కావాలి..

**పెండ్లిమర్రి, జనవరి 20, ప్రభాతవార్త:**

పెండ్లిమర్రి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షల నిర్వహణను మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.జగన్మోహన్‌రెడ్డి, డి ప్యూటీ ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డిలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివితే మంచి మార్కులు సాధిస్తారని ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అభివృద్ధి, ఆదర్శంలో అగ్రగామి ఎస్.ఉప్పలపాడు

**జమ్మలమడుగు, జనవరి 20, ప్రభాతవార్త:**



ఎస్.ఉప్పలపాడు ఆదర్శ గ్రామంలో పలు భవనాలకు, అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ (ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న వారు) ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, కడప జిల్లా పూర్వపు కలెక్టరు మరియు తెలంగాణ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ హరికిరణ్, జిల్లా జేసీ నిధి మీనా, నాయకులు భూపేష్‌రెడ్డి, గ్రామాభివృద్ధికి సహకరించిన మాయలూరు రామమనోహర్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద అంచనా వ్యయం రూ.245లక్షలు, రోడ్లు రహదారులు మరియు భవనాల శాఖ తరుపున రూ.490లక్షలు, ఉప్పలపాడు ఆదర్శ గ్రామానికి గంగమ్మ దేవర దేవస్థానం పున: నిర్మాణం కింద సీజెఫ్ కింద రూ.55లక్షలు, కేటాయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డ్వామా డీఆర్‌డీఏ పీడీ ఆదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఇస్తేమా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి





**కడప,జనవరి 20 : ప్రభాతవార్త**

జనవరి 23, 24, 25 తేదీలలో జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి "షుభే అండ్రాకే ఖురాన్‌కా దీనీ ఇజ్తెమా" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ను చేస్తున్నామని జిల్లా ఇంచార్జ్ మంత్రి మరియు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ఎస్.సవిత పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సికె దిన్నె మండలం కొప్పర్తి పారిశ్రామికవాడలో జనవరి 23, 24, 25 వ తేదీలలో నిర్వహించే ఇస్తేమా కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్ల పై జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్.సవిత,రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్, కమలా పురం శాసనసభ్యులు పుత్తాకృష్ణచైతన్యరెడ్డిలతో కలిసి అధికారులు, కార్యవర్గ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ మైనార్టీ సోదరులు నిర్వహిస్తున్న ఇస్తేమా కార్యక్రమం ను ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని,ఇది చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలిసి చేసుకునే అతి పెద్ద మైనార్టీ పండుగగా ఈ ఇస్తేమా ఉంటుందన్నారు. ప్రభుత్వం అన్ని విభాగాల ద్వారా అవసరమైన వసతులు, త్రాగునీరు, రోడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు ఏర్పాటు చేసిందని,100 పడకల ఆసుపత్రి, 350 మంది పారిశుద్ధ్య కార్మికులు, బస్సు సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారని,మైనార్టీలను గౌరవించే కూటమి ప్రభుత్వం సహకారంతో ఈ కార్యక్రమాన్ని అందరం కలిసి విజ యవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మైనారిటీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. మూడు రోజు లు పాటు జరిగే ఇస్తేమా కార్యక్రమానికి ఆంధ్రా, తెలంగాణా నుండి కూడా పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు రావడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించి రోడ్ మ్యాపు, త్రాగు నీరు, విద్యుత్, మెడికల్,ట్రాఫిక్, బందోబస్తు,ఫైర్ సేఫ్టీ, బ్యారికేడ్స్ వంటి తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఇస్తేమా కార్యక్రమం ప్రశాంత వాతావరణం లో జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలనన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఇస్తేమా కార్యక్రమ నిర్వహణకు ఇది వరకే తీసుకున్న నిర్ణయం ప్రకారం అందరూ అంగీకరించిన ప్రణాళిక ను అనుసరించి వివిధ రకాల పనులను చేపట్టడం జరిగిందని,ఈ పనులు దాదాపుగా పూర్తయ్యాయని మిగిలిన పనులను బుధవారం లోపు పూర్తి దశకు చేరుకునే స్థితిలో ఉన్నాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 4 తాత్కాలిక ఆసుపత్రులు, 4 అంబులెన్సులు ఏర్పాటు చేసి,డాక్టర్లు అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఇస్తేమా కార్యక్రమ నిర్వాహకులతో పోలీస్ శాఖ సమన్వయంతో సెక్యూరిటీ మరియు సేఫ్టీ ప్లాన్‌ను రూపొందించడం జరిగింది. ఇందులో ట్రాఫిక్ సెక్టార్ నుంచి రూట్ క్లియరెన్స్ వరకు సెక్టర్ వారీగా విభజించి ప్రణాళిక అమలు చేయబడుతుందనన్నారు. సమావేశం నిర్వహించే ప్రాంతాన్ని భద్రత మరియు సురక్షి త దృష్టి కోణంతో నిర్వహించడంతో పాటు, పార్కింగ్ స్థలాలను కూడా పూర్తిగా ఎంపిక చేయడం జరిగిందని, అదే విధంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, క్రౌడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేస్తామని తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ నందు ట్రాన్స్‌కో, వైద్య ఆరోగ్య శాఖ, ఫైర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందు బాటులో ఉంటారని తెలిపారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గ పరిధిలో ఇస్తేమా కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషమని, ఈ కార్యక్రమ నిర్వహణలో ఎక్కడ కూడా ఎలాంటి ఆవంచానీయ సంగటనలు జరగ కుండా ఎవరికి అంతరాయం జరగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. ఈ సమీక్షలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు,కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపి ఐఐసి జెడ్ఎం శ్రీనివాస మూర్తి, డిపివో రాజ్యలక్ష్మి, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ రమణ,ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఆర్ అండ్ బి ఎస్ఈ చంద్ర శేఖర్,నాయకులు బిటెక్ రవి,అమీర్ బాబు, తదితర అధికారులు, కమిటీ కార్యవర్గ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం

**వేంపల్లె:20:జనవరి:(ప్రభాత వార్త)**



భక్తి శ్రద్ధలతో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ వెల్లడించారు. మంగళవారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అలాగే వేద మంత్రోచ్ఛరణతో చండీహోమం నిర్వహించి, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కన్యకలకు మంగళ స్నానాలు చేయించారు. అనంతరం తాంబూలాలు అందజేశారు. అంతేకాకుండా అమ్మవారికి ఒడిబియ్యం పెట్టారు. అగ్ని గుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. వాసవిమాత అహింసను పాటిస్తూ తన గౌరవాన్ని కాపాడుకోవడానికి 102 గోత్రాలకు చెందిన వారితో కలిసి అగ్నిలో ప్రవేశించారని, తన భౌతిక దేహాన్ని విడిచి పెట్టినట్లు వివరించారు. భక్తులకు అన్నదానంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ వై.హరినాథ్ రెడ్డి, పంచాయతీ ఇఓ నాగభూషణం రెడ్డి లు వాసవి మాతను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ, ఆలయ నిర్వాహకుడు మిట్టామోహన్, అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం తదితర కార్యవర్గాల సభ్యులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణం శోభయాత్రకు తరలిరండి..

**కడప కార్పొరేషన్ జనవరి 20 ప్రభాతవార్త:**



అయోధ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 21 తేదీ శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం, 22వ తేదీ శ్రీరామ మహాశోభయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామి, అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్ భట్టర్, ఐక్యవేదిక నాయకులు దేసు వెంకటరెడ్డి, వి హెచ్ పి జిల్లా అధ్యక్షులు చెన్న కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కడప నగరంలో స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం జరిగే మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం, శ్రీరామ మహాశోభయాత్రను సంపూర్ణమైన భక్తిశ్రద్ధలతో చివరివరకు అత్యంత శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అయోధ్యలో బాల రాముడికి ప్రతిష్ఠించి రెండేళ్ళ పూర్తయిన సందర్భాన్ని వార్షికోత్సవంగా నిర్వహించుకునేందుకు ఈ శ్రీరామమహాశోభయాత్రను రూపొందించి అందరి సహకారంతో కార్యక్రమ నిర్వహణకు సిద్ధం చేశామన్నారు. ఈ యాత్ర ఎలాంటి బల ప్రదర్శన కోసం కాదని, కేవలం మనుషుల మధ్య ఐక్యతను, శాంతి సాధన దీక్షను కోరుతూ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో భాగంగా 21వ తేది సాయంత్రం 5 గంటల నుంచి మున్సిపల్ మైదానంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ప్రారంభమవుతుందన్నారు. మరుసటిరోజు 22వ తేది నగరంలోని చిన్నచౌకు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి మహా శోభాయాత్ర మొదలవుతుందన్నారు. మరుసటిరోజు ఉదయం వరకు ఈ యాత్ర కొనసాగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యాత్రలో అడుగడుగునా అల్పాహారం, మంచినీటికి కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. హిందూ బంధువులంతా శ్రీరామునిపై భక్తితో ఐక్యతను చాటుకుంటూ ఈ యాత్రలో పాల్గొని శాంతి కాముకత్వాన్ని చాటుకోవాలన్నారు. ఈ సమావేశంలో అయోధ్య ఐక్యవేదిక ప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్ సూర్యనారాయణరావు, బాలకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ఉల్లి శ్రీనివాస్, ప్రసాద్ రెడ్డి హిందూ సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.

# 50 కోట్లతో గ్రామీణ ఆలయాలకు ప్రతిపాదన : మంత్రి మండిపల్లి






**లక్కిరెడ్డిపల్లి: జనవరి 20 ప్రభాత వార్త**

నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలోని చిన్న చిన్న ఆలయాలు పూర్తి చేసేందుకు 50 కోట్ల రూపాయలు ప్రతిపాదనలు పంపించామని అలాగే రాయచోటి నియోజకవర్గంలోని ప్రస్తుతం 11 కోట్ల రూపాయలతో 22 ఆలయాలు నిర్మాణం చేపడుతున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అనంతపురం గంగమ్మ జాతరలో పార్వేటు తిరుణాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో ప్రతి ఆలయంలో పనిచేస్తున్న అర్చకునికి ధూపదీప నైవేద్యానికి పదివేల రూపాయలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఎంతో కృషి చేస్తుందని ఆయన అన్నారు. అనంతపురం గంగమ్మ తల్లి కృప వల్ల నియోజకవర్గ ప్రజలు క్షేమంగా ఉన్నారని ఆయన అన్నారు. గంగమ్మ జాతర ఆలయ అభివృద్ధి కోసం నాలుగు కోట్ల రూపాయలతో గర్భగుడి ,మహా మండపం ,12 విశ్రాంతి గదులు, రాజగోపురం, రెండేళ్లలోపు పూర్తి చేస్తామన్నారు. దాతలు 10 శాతం నిధులు అందిస్తే ప్రభుత్వం 10 లక్షలు నుండి 10 కోట్ల వరకు నిధులు అందిస్తుందన్నారు. నియోజకవర్గంలోని వీరభద్ర ఆలయం నల్లగంగమ్మ ఆలయం అమ్మవారి పుట్టినిల్లయిన చాగలగుట్టపల్లి ఆలయాలకు మాస్టర్ ప్లాన్ వేసి అభివృద్ధికి తోడ్పడుతామన్నారు. 2 కోట్ల రూపాయలతో నల్ల గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

### జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..

ఫిబ్రవరి 16,17,18 తేదీలలో జరగబోవు అనంతపురం గంగమ్మ జాతరకు అన్ని వసతులు కల్పిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా రెవిన్యూ పోలీసు పంచాయతి రాజ్ అధికారులతో సమావేశపరిచి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు మరుగుదొడ్లు వాహనాల పార్కింగ్ అన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆది మూలం రామచంద్ర కుటుంబ సభ్యులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, మండల అధ్యక్షుడు మదన్ మోహన్, రాష్ట్ర అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డి యాదవ్, మార్కెట్ చైర్మెన్ షఫీ నాయక్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ ఎం డి షఫినాయక్, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, రామాపురం మండల అధ్యక్షుడు సురేంద్రా రెడ్డి, ఎర్రగుడి చంద్రశేఖర్ రెడ్డి, గాజుల ఖాదర్బాషా, మద్దిరేవుల సింగల్ విండో అధ్యక్షుడు దేవేంద్రా రెడ్డి, సుధీర్, దేవేంద్రా రెడ్డి, ఆదిమూలం రెడ్డి శేఖర్, ఆలయ ఈవో శ్రీనివాసులు, తాసిల్దార్ క్రాంతి కుమార్ ఎంపీడీవో రెడ్డయ్య, డిప్యూటీ ఎంపీడీవో వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో ఉషారాణి, సిఐలు , ఎస్సైలు,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లు ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

**మైదుకూరు, జనవరి 20, ప్రభాతవార్త:**



మైదుకూరు మండలంలోని అన్ని చౌకదుకాణ డీలర్లకు తో తహశిల్దార్ రాజ సింహా నరేంద్ర ప్రతి నెల జరుగు సమావేశంలో భాగంగా సమావేశమై పలు సూచనలు చేశారు. డీలర్లతో ఆయన మాట్లాడుతూ జనవరి నెలలో జరిగిన పంపిణీపై వివరాలుతోపాటు ఫిబ్రవరి నెలలో పిడిఎస్ పంపిణీ పురోగతి,తక్కువగా పంపిణీ చేసిన దుకాణాలు తక్షణం మిగిలిన పంపిణీ పూర్తి చేయాలని, 65 కార్డుదారులకు ఇంటింటికీ పంపిణీ ప్రతి నెల 26వ తేదీ నుండి 30వ తేదీ లోపు తప్పని సరిగా పూర్తి చేయాలి, ప్రతి నెల 1వ తేదీ నుండి రెగ్యులర్ పిడిఎస్ పంపిణీ ప్రారంభించాలి,కొంతమంది డీలర్లు వృద్ధుల పంపిణీతో పాటు రెగ్యులర్ పంపిణీ చేస్తున్నారు. అలా చేయకూడదని సూచన చేశారు. పంపిణీ సమయంలో కార్డుదారుల నుండి బియ్యం కొనుగోలు చేయడం లేదా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ కు మళ్లించడం పై 6 ఏ కింద కేసు, డిసిప్లినరీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఐసిడిఎస్ సరుకుల పంపిణీ సక్రమం గా వెంటనే పూర్తి చేయాలని, జనవరి నెల చక్కెర లిఫ్టింగ్ ఛార్జీల చెల్లింపు డీలర్లు సమయానికి తప్పనిసరిగా చెక్కెరకు డి డి లు చెల్లింపు,ఈ కేవైసీ పెండింగ్ జాబితా మీ పరిదిలో ఉన్న సంబంధిత కార్డ్ హెల్డర్ల ను తక్షణం పూర్తి చేయాలని, పెండింగ్ లో ఉన్న వాటిని పూర్తి చేయాలని కొత్త స్మార్ట్ కార్డుల పెండింగ్ పంపిణీ వేగంగా పంపిణీ చేయాలన్నారు.

వాసవిమాతకు

## పట్టు వస్త్రాలు సమర్పించిన జగన్మోహన్ రాజు

**రాజంపేట జనవరి 20 ప్రభాతవార్త**

వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వం తరఫున అమ్మవారికి తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా చమర్తికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలో ఆయన పాల్గొన్నారు. పూజల అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు నరసింహస్వామి, కాళీ చరణ్ లు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జి, సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు దోర్నాదుల వెంకటేష్ , సీనియర్ నేత పబ్బిశెట్టి సుబ్రమణ్యం, ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ తలిశెట్టి రమేష్ తదితర ఆర్యవైశ్య సంఘం నాయకులు జగన్మోహన్ రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూశ్రీ కన్యకా పరమేశ్వరి వాసవి మాత ఆత్మార్పణ కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగాకూటమి ప్రభుత్వం నిర్వహించడం శుభ పరిణామమన్నారు.ఆర్యవైశ్య నాయకులు మాట్లాడుతూ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం,మండల అధ్యక్షులు మేడికొండు రవికుమార్ నాయుడు, మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు,పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీమ్,ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



వాసవి మాతకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న జగన్మోహన్ రాజు

# భవిష్యత్తు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ దే

**కురబలకోట జనవరి 20 ప్రభాతవార్త**

భవిష్యత్తు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ దేననీ ముఖ్య అతిధులు ఎల్. వెంకటేష్, ఏ .గోపీనాదులు అన్నారు. మంగళవారం కురబలకోట మండలం అంగళ్లు కు సమీపంలోని మీట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం, మిట్స్ ఐఎస్ టిఈ స్టూడెంట్స్ చాప్టర్ మరియు గూగుల్ క్లౌడ్ వారి సహకారంతో జనరేటర్ ఏఐ లీడర్షిప్ ఫౌండేషన్ ప్రోగ్రాం 2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ చెందిన ఎల్ ఫోర్ జి కంపెనీ ట్రైనర్లు వెంకటేష్ ,గోపీనాథ్ విద్యార్థులకు జనరేటివ్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో విభాగాధిపతి. డాక్టర్ .ఎస్ . కుసుమ మాట్లాడుతూ ప్రస్తుతం ఆధునిక ప్రపంచం జనరేటివ్ ఏఐ ప్రాముఖ్యతను వివరించారు. కృత్తిమ మేధస్సు ను సమాచారం మాత్రమే ఏఐ మాత్రం కొత్త ఆలోచనలు మరియు కొత్త సమాచారాన్ని తయారు చేస్తోందని తెలిపారు. అందువల్ల విద్య, పరిశ్రమలు, వ్యాపారం సృజనాత్మక రంగాలలో జనరేట్ ఏఐ కీలక సాంకేతిక పరిజ్ఞానముగా ఉపయోగపడుతుందన్నారు. జనరేటివ్ ఏఐ ఉపయోగించి పరిశ్రమలు మరియు వ్యాపార రంగాల్లో నివేదికలు



తయారు చేయడం డేటా నిశ్లేశించడం కొత్త ఉత్పత్తుల ఆలోచనలు రూపొందించడం వంటి పనులను తక్కువ సమయంలో పూర్తి చేయడంలోనూ మరియు సాఫ్ట్వేర్ రంగంలో కోడింగ్ సమస్యలను గుర్తించడం కొత్త అప్లికేషన్ అభివృద్ధి చేయడంలో. జనరేటివ్ ఏఐ యొక్క ముఖ్యమైన పాత్రలు పోషిస్తుందన్నారు. నూతన టెక్నాలజీలకు ఇన్పుట్ సాధనాలను ఎలా ఇవ్వాలి ఏఐ పరికరాలను ఎలా ఉపయోగించాలి అనే అంశాలపై విద్యార్థులకు 8 బ్యాచ్లుగా నిర్వహించి దాదాపు 500 మందికి విద్యార్థులకు శిక్షణను అందించారు. విద్యార్థులు దృష్టి సారించి అవగాహన పెంచుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో కుమార్ ఆర్ రూప అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డను చదివించడం తల్లిదండ్రుల బాధ్యత

**పీలేరు జనవరి 20 ప్రభాతవార్త:**

ప్రతి ఆడబిడ్డను కాపాడడం, చదివించడం తల్లిదండ్రుల ప్రధాన బాధ్యత అని అన్నమయ్య జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. హైమావతి తెలిపారు. మంగళవారం పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాలలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి కె. హైమావతి అధ్యక్షతన బేటీ బచావో బేటి పఢావో, బాల్య వివాహముక్త్ భారత్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 సంవత్సరాల వయస్సు నిండాకే వివాహం అన్నారు. అదేవిధంగా ఆడబిడ్డను కాపాడుకుంటూ వారిని ఉన్నతంగా చదవనిద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి హైమావతి తో పాటు ప్రాజెక్టు సిడిపిఓ రాజమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయవంతం చేశారు.

# మోట్నూతలపల్లిలో తోటలో అగ్నిప్రమాదం

**పులివెందుల , జనవరి 20, ప్రభాతవార్త :**

పులివెందుల మండల పరిధిలోని మోట్నూతలపల్లి గ్రామానికి చెందిన తలుపుల రామచంద్రుడు, భీముడు నాయక్‌లకు సంబంధించిన తోటలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసు కుంది. ఈ ప్రమాదంలో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దాదాపు 8,000 చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం.అకస్మాత్తుగా చెలరేగిన మంటలు వేగంగా వ్యాపించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరా లేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో రైతులకు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అతి కష్టం మీద అదుపులోకి తెచ్చారు. బాధిత రైతులు అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి రైతును ఆదుకోవాలి అని కోరుతున్నారు. అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.





## మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి

రాజంపేట, జనవరి20 ప్రభాతవార్త



వికసితభారత్ గ్యారెంటీ రోజ్గార్ అజీవిక మిషన్ గ్రామీణ పథకాన్ని రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా పునరుద్ధరించాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి డిమాండ్ చేశారు. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గకాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూల భాస్కర్ అధ్యక్షతన మంగళవారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక విప్లవాత్మకమైన, చరిత్రా త్మకమైన పథకం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల మీద ఆర్థిక భారం లేకుండా కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్రప్రభుత్వం 10 శాతం నిధులు భరించే విధంగా ఈ పథకానికి రూపకల్పన జరిగింది.మొత్తం ఖర్చులో 60 శాతం కూలీలకు,40 శాతం అభివృద్ధి పనులకు ఖర్చు చేసే విధంగా పథకానికి రూపకల్పన జరిగిందన్నారు. మోడీ ప్రభుత్వం 2025 డిసెంబర్లో ఈ పథకం పేరు మార్చడమే కాకుండా,కేంద్ర నిధుల వాటాను 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించిందని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాన్ని రద్దు చేస్తూ పాత పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో రాజంపేట మండల అధ్యక్షుడు మహదేవయ్య, కట్టారు సుబ్బరామిరెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తన్న, కరిమిరెడ్డి అమర్నాథ్ రెడ్డి , ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు,నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## తులసీరామ్ ఆయన పేరు నిలబెట్టావు

తంబళ్లపల్లె జనవరి 20 ప్రభాతవార్త ః



వంద రోజుల యాక్షన్ ప్లాన్ పరీక్షల్లో 20కి20 మార్కులు సాధించిన టెన్త్ క్లాస్ విద్యార్థి తులసీరామ్ ను స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి భుజం తట్టి బేష్ ఆయన పేరు నిలబెట్టావని ప్రశంసించారు. మంగళవారం ఆయన మోడల్ స్కూల్ సందర్శించి విద్యార్థుల విద్యా విధానంపై ఆరాతీసి వందరోజుల యాక్షన్ ప్లాన్ పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ కనబరచడం పై సంతృప్తి వ్యక్తం చేసి టెన్త్ పరీక్షల్లో ఒక్కరు కూడా ఫెయిల్ కారాదని పట్టుదలతో చదవాలని ప్రోత్సహించారు. విద్యతోపాటు క్రీడలు, క్రమశిక్షణ, తల్లి,తండ్రి,గురువులను గౌరవించి చెడు అలవాట్లకు దూరంగా ఉండి వ్యక్తిగత పారిశుధ్యం, మొక్కల పెంపకం పై దృష్టి సారించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకొందాం

### సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె, జనవరి 20 ప్రభాతవార్త :



ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న దృశ్యం

కార్మికులు అందరూ ఐక్యంగా ఉండి ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామి చట్టం స్థానంలో విబిజిఆర్ఎంజి చట్టం తీసుకురావడం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికులకు పనులు లభించక వలసలు వెళ్ళే ప్రమాదం ఉందన్నారు. నూతన ఉపాధి చట్టం అమలులోకి వస్తే రాష్ట్రాలపై భారంపడి క్రమంగా పథకం అమలుపై నీలినీడలు కమ్ముకొంటాయన్నారు. విబిజిఆర్ఎంజి పథకాన్ని రద్దు చేసి తక్షణం మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పరిరక్షణ కోసం ఉద్యమించాలని తీర్పునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి, రఘునాథ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వంతెనలకు మరమ్మత్తులు చేపట్టండి

### ఆర్అండ్‌బి ఈఈకి బివైఎస్ విన్నపం

మదనపల్లె, జనవరి 20 ప్రభాతవార్త :



ఈఈకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రధాన రహదారులపై ఉన్న పాత వంతెనలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొన్నాయని వీటిని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్అండ్‌బి ఈఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసి బస్టాండు సమీపంలోని సిటిఎం రోడ్డు వంతెన, బెంగుళూరు బస్టాండు వంతెన, టౌన్‌బ్యాంకు సమీపంలోని వంతెనలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు లేవని, ఇనుపరాడ్లు తుప్పుపట్టి ఊడిపోవడంతో ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత ప్రభుత్వం వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని ప్రకటించినప్పటికి క్షేత్రస్థాయిలో పనులు మాత్రం జరగలేదన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ రోజు రోజుకు పెరగడం వల్ల పాత వంతెనలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కొత్త వంతెల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బివైఎస్ నాయకులు జిలాని, రెడ్డిశేఖర్, శశికుమార్, వినయ్, కరుణాకర్, ఆది, జగదీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## హజ్‌యాత్రికుల సౌకర్యాల కల్పనకు కృషి

### రాష్ట్ర హాజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్‌ఖాదర్‌ఖాన్

మదనపల్లె, జనవరి 20 ప్రభాతవార్త :



హజ్ యాత్రకు వెళ్ళే ముస్లింలకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర హాజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్‌ఖాదర్‌ఖాన్ తెలిపారు. మంగళవార ఆయన మక్కా నగరంలోని హాజీజియా ప్రాంతంలో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో కేటాయించబడిన హాజ్ బిల్డింగ్స్‌ను పరిశీలించారు. మౌళిక సదుపాయాలు, వసతి ఏర్పాట్లు, పరిసర ప్రాంతాల సౌకర్యాలు తదితర అంశాలను సమగ్రంగా అడిగి తెలుసుకొన్నారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఫారూక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి షరీఫ్‌సాబ్, హాజ్‌కమిటీ ఛైర్మెన్ అసన్‌బాషాకు యాత్రికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై తెలియజేయడం జరిగిందన్నారు. రాష్ట్రం నుంచి హాజ్‌కు వెళ్ళే యాత్రికులకు సకల సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

## డ్రైనేజీ పనులు ప్రారంభం

కలికిరి, జనవరి 20, ప్రభాతవార్త:



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ పాత హరిజనవాడలో పీలేరు ఎమ్మెల్యే ఆదేశాలతో డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. హరిజనవాడలో డ్రైనేజీ కాలువలు లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి హరిజనవాడలో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సర్పంచ్ ఆ పనులను ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ రెడ్డిరామ్, గ్రామస్థులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలి

### వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్

నిమ్మనపల్లె, జనవరి 20 ప్రభాతవార్త :



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రెడ్‌బుక్ రాజ్యాన్ని నడుపుతున్న కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ కోరారు. మంగళవారం నియోజకవర్గంలోని నిమ్మనపల్లె అభయాంజనేయస్వామి ఆలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ ఎంపి మిథున్‌రెడ్డి పేరుమీద అర్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎంపిపై పెట్టిన అక్రమంగా మద్యం కేసు నమోదు చేసి జైలుకు పంపడం జరిగిందన్నారు. బెయిల్ మంజూరు అయిన తరువాత మొక్కులు తీర్చుకోవడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ పాలకులకు కనువిప్పు కలిగించాలని స్వామిని కోరుకోవడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రెడ్డిశేఖర్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి. శ్రీనివాసులురెడ్డి, శంకరయ్య, దావూద్‌ఖాన్, పొట్టురమణ, రవితేజ,రఫి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాలను పునరుద్దరించాలి

### బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు

మదనపల్లె, జనవరి 20 ప్రభాతవార్త :



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాలను పునరుద్దరించాలని, సబ్‌ప్లాన్, కార్పోరేషన్ రుణాలు మంజూరు చేయాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. మంగళవారం సాంఘీక సంక్షేమశాఖ మంత్రి బాల వీరాంజనేయులను కలసి సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి పట్ల జరుగుతున్న అన్యాయాలపై కూటమి ప్రభుత్వం స్పందించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసుల పరిష్కారంకు గతంలో ఏర్పాటు చేసిన స్పెషల్ డీఎస్‌పి విధానం అమలు చేయాలన్నారు. అట్రాసిటి కేసుల్లో బాధితులు చనిపోతే వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో, టిటిడి సంస్థల్లో పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేసి రూల్‌ఆఫ్ రిజర్వేషన్ల విధానాన్ని పాటించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కార్పోరేషన్ నిధులు మంజూరు చేసి సబ్సిడీరుణాలు అందించాలన్నారు. సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

## వైశ్య వంశాబ్ది సుకుమార వనజం

చౌడేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త



వైశ్యకుల పరిరక్షణకే శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణం చేసుకొందని ఆర్యవైశ్యులన్నారు. వాసవీమాతా 2506వ ఆత్మార్పణా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ ఉదయాన్నే అమ్మవారికి ఇంటింటి నుంచి పాలను తెచ్చి క్షీరాభిషేకం చేసారు. వేదపండితుల ఆధ్వర్యంలో కలశస్థాపన, హోమాధి కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యంగా మహిళలు సాయంత్రం వరకు పలు రకాల పూజలతో అమ్మవారిని ఆరాధించారు. కుసుమశ్రేష్ఠి పుత్రికగా జన్మించి ఆర్యవైశ్యకుల రక్షకురాలుగా ఆత్మార్పణం చేసుకొన్నారంటూ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ సేవా కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## 108అంబులెన్స్‌లో డ్రైవర్ల పోస్టుకు ధరఖాస్తు ఆహ్వానం

చౌడేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త

108అంబులెన్స్‌లో డ్రైవర్ల పోస్టుకు ధరఖాస్తు చేసుకోవాలని 108జిల్లా మేనేజర్ మోహన్‌బాబు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ జగదీష్, మనోజ్‌రెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి చదివి, హెవీలైసెన్స్, బ్యాడ్జి కల్గిన, 35యేళ్ళలోపు వ్యక్తులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 22, 23న తిరుపతి డిఎంహెచ్ఓ కార్యాలయం, పాత మెటర్నరీ ఆసుపత్రి, అలిపిరి రోడ్డులో జరిగే ఇంటర్వ్యూకు హాజర కావాలన్నారు.

## సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ

కలికిరి, జనవరి 20, ప్రభాతవార్త:



మండలంలోని మేడికుర్తి, మర్రికుంటపల్లె పంచాయతీల్లోని సచివాలయాలను మంగళవారం ఎంపీడీవో భానుమూర్తిరావు, డిప్యూటీ ఎంపీడీవో వినయ్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భానుమూర్తిరావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టిన యునిఫైడ్ ఫ్యామిలీ సర్వేని కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది త్వరితగతిన వెంటనే పూర్తి చేయాలన్నారు. ( ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సతీష్, గంగాదేవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అశోక్, వెల్ఫేర్ అసిస్టెంట్ గుణశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేములలో టైలింగ్ పాండ్ ఎత్తు పనులపై ఆర్డీఓ పరిశీలన

పులివెందుల,జనవరి 20, ప్రభాత వార్త :

పులివెందుల నియోజక వర్గంలోనీ వేముల మండలం కేకే కొట్టాల గ్రామ సమీపంలో యురేనియం అధికారులు మరమ్మతుల పేరుతో చేపడుతున్న టైలింగ్ పాండ్ ఎత్తు పనులను మంగళవారం పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య పరిశీలించారు. టైలింగ్ పాండ్ ఎత్తు పెంపు వల్ల భవిష్యత్‌లో పర్యావరణానికి, రైతుల పంటలకూ నష్టం వాటిల్లే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కేకే కొట్టాల గ్రామస్థులు ఆర్డీఓను కలిసి ప్రజల పక్షాన నిలబడి యురేనియం అధికారుల మోసాన్ని ఎండగట్టి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. టైలింగ్ పాండ్ పనులకు సంబంధించి తమకు సరైన సమాచారం ఇవ్వకుండా, అనుమతులు తీసుకోకుండా పనులు చేపడుతున్నారని వారు ఆరోపించారు. అయితే యురేనియం అధికారులు రైతులకు అనుమతి ఇవ్వకపోవడంతో ఆర్డీఓ ఒక్కరే వెళ్లి పరిశీలన నిర్వహించాల్సి వచ్చింది. పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆర్డీఓ చిన్నయ్య, గ్రామస్థుల అభ్యంతరాలు, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.టైలింగ్ పాండ్ ఎత్తు పనులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, ప్రజల భద్రతకు భంగం కలగకుండా తగిన నిర్ణయం తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మానవసేవే మాధవసేవ

ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 20 ప్రభాత వార్త

స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నందు గుర్తుతెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మేఘహెల్ప్యూ ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుభహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి మంగళవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ సుభహాన్,అహమ్మద్ హుస్సేన్,వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా,ఈశ్వర్ వర్ధన్ రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి అంత్యక్రియలను పూర్తి చేశారు. ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు.మేఘహెల్ప్యూ ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు.

# బద్వేలులో శాస్త్రోక్తంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు

: తెల్లవారుజామునుంచే అమ్మవారిని దర్శించుకున్న భక్తులు







బద్వేలు అర్బన్, జనవరి 20 , ప్రభాతవార్త :

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న, .సుబ్బారావు, సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు,మరియు పలువురు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే వాసవిమాత అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకం, వివిధ రకాల ప్రత్యేక హోమాల కార్యక్రమాన్ని వేద పండితుల బోయలకుంట్ల సుబ్బనరసయ్య, సుబ్బరామశర్మ, సుబ్రమణ్యం ల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా పెద్దశెట్టి వృషికేశవ గుప్తా కుటుంబ సభ్యులతో కార్యక్రమం ప్రారంభించారు. అలాగే 102 మంది శాశ్వత ఉభయదాతలచే వాసవి కన్యకా పరమేశ్వరి దేవి నిజరూప అలంకరణ, అభిషేకం కార్యక్రమాన్ని కమిటి సభ్యుల సహకారంతో నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు శ్రీసాయి వెంకటేశ్వర ట్రేడర్స్ అండ్ పార్ట్‌నర్స్ సహకారంతో అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.అలాగే మధ్యాహ్నం 60 సంవత్సరాలు దాటిన మహిళలకు లక్కీ డ్రిప్ ద్వారా 11 మంది ఆర్యవైశ్య మహిళా మండలి వారిచే చాటల వాయనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంకాలం ఆర్యవైశ్యులందరికీ ప్రత్యేక కంకణదారణ కార్యక్రమం చేపట్టి అగ్నిగుండ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక రకాల పూలతో చండికాదేవి అలంకారం, విశ్వరూపం అలంకారం పలువురు భక్తులను ఆకట్టుకునేలా నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటి సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో ట్రెజరర్ భూపాళం నాగరాజారావు, ఉపాధ్యక్షులు మాలేపాటి వెంకటేశ్వరరావు, యాదాళ్ల క్రిష్ణమూర్తి, దర్శి సుబ్బరాజ,సగళా గోవిందస్వామి, చలపాటి రవికుమార్, జూటూరు నాగరాజ, చాటకొండు సత్యనారాయణ, చిన్ని లక్ష్మీనారాయణ ప్రసాద్, దిండుకుర్తి సుబ్బరాయుడు, సగళా రాధాక్రిష్ణమూర్తి , బెస్తమళ్ల సునీల్‌కుమార్, భూపాళం వెంకటేశ్వర్లు, కొప్పరపు శ్రీనివాసులు, తుమ్మలపెంట వెంకటసుబ్బయ్య, కొలపర్తి వెంకటసుబ్బారావు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత , స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, కళ్యాణి, జూటూరు పద్మ, వందవాసి ధనలక్ష్మి, క్రిష్ణవేణి, పొదిలి పద్మ, వెంకటసుబ్బమ్మ, భూపాళం రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సహకారం కార్యక్రమం

వేంపల్లె జనవరి 20 (ప్రభాత వార్త)



మండలంలోని చింతలమడుగు పల్లెలో మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆత్మీయ సహకారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు సేవాభావంతో సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు డాక్టర్ యోగీశ్వర బాబు లు మాట్లాడుతూ అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత నివ్వడమే మానవతా సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రీజినల్ చైర్మన్ చల్లా బాలాజీ, డైరెక్టర్ సభ్యులు కొప్పుల గంగయ్య, అడ్వైజరీ సభ్యులు రంగయ్య, కో చైర్మన్ పోతిరెడ్డి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొని గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మానవతా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆ గ్రామస్థులు అభినందించారు.

## రాబోయే రోజుల్లో టీడీపీకి స్వర్ణ యుగం



జమ్మలమడుగు, జనవరి 20, ప్రభాతవార్త:

రాబోయే కాలంలో తెదేపాకు స్వర్ణ యుగమని రాష్ట్రంలోని ప్రజలందరూ కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మ, తెదేపా జిల్లా అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు ఆదర్శ గ్రామ పంచాయతీలో ఉప్పలపాడు గ్రామ సీనియర్ నాయకులు ఎంబీ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 350 కుటుంబాలు తెదేపాలో చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మ, తెదేపా జిల్లా అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబుల నేతృత్వంలో కడప జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ తుమ్మలూరు మల్లికార్జున, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు టంగుటూరి ముని సుబ్బారెడ్డి కుటుంబీకులు, మస్తాన్‌రెడ్డి, అక్కల బ్రదర్స్, పొన్నబోయిన బ్రదర్స్, మూరబోయిన బ్రదర్స్, కూటమి నాయకులు తెదేపాలో చేరిన 350 కుటుంబాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానం చేయడంతో సమానం



బద్వేలు అర్బన్, జనవరి 20, ప్రభాతవార్త :

ప్రతిరోజూ అనుకోకుండా అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూ ప్రమాదంలో తీవ్రగాయాలై రక్తం కోల్పోయి అనేక చోట్ల ఎన్నో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. బద్వేలు పట్టణంలో బ్లడ్ డోనర్స్ గ్రూపు అధ్యక్షులు వల్లంకొండు రాఘవేంద్ర, పోకల నాగేశ్వరరెడ్డి మరికొందరు యువకులు బద్వేలు ప్రాంతంలో ఎక్కడ ఎవరికి ఏగ్రూపు రక్తం అసరమో కనుకుని రక్తదానం చేసి అనేకమంది ప్రాణాలకు అండగా నిలుస్తున ఆనరు. ఈ నేపత్యంలో మంగళవారం పట్టణంలోని ఓ మహిళకు రక్తం అవసరం అని తెలిసిన వెంటనే గ్రూపు అడ్మిన్ వల్లంకొండు రాఘవేంద్ర సకాలంలో రక్తదానం చేసి ఆమె ప్రాణాలు కాపాడారు. అనంతరం గైనకాలజిస్ట్ దివ్య మాట్లాడుతూ బద్వేలుపట్టణం లో గత 2 సంవత్సరాలకు పైబడి బ్లడ్ డోనర్స్ గ్రూపు పెద్దలు హాస్పిటల్‌లో ఎవరికి రక్తం అవసరం వచ్చినా వారు పెట్టిన గ్రూపులో రక్తం అవసరం అన్న వెంటనే గ్రూపుసభ్యులు రక్తం చేయించడం అభినందనీయమన్నారు. సకాలంలో రక్తదానం చేయడం వలన మరొకరి ప్రాణదానం చేయడంతో సమానమని కావున ప్రతి ఒక్కరూ దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు.

## మున్సిపల్ అధికారుల పనితీరు పై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రొద్దుటూరు జనవరి 20 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ అధికారుల పనితీరు పై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతో సహా ప్రతి ఒక్క అధికారి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. జీతాలు తీసుకుని, వెళ్ళిపోతే సరిపోదని తెలిపారు. పని చేయాలనుకున్న అధికారులు ఉండాలని, లేనిపక్షంలో వెళ్లిపోవాలని సూచిస్తుంది. మున్సిపల్ కమిషనర్ పనితీరు కూడా ఆశించినంతగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు జీతాలు ఇచ్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని మున్సిపల్ ఆర్ డి కి ఫోన్ ద్వారా సంప్రదించారు. మున్సిపల్ పెట్రోల్ బంక్ లో కోటి 23 లక్షల అవినీతి జరిగితే ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. అధ్వాన్నమైన పనితీరు కలిగిన అధికారులను ఎప్పుడూ చూడలేదని కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రావులకొలనలో పోలీసుల విస్తృత తనిఖీలు

పులివెందుల జనవరి 20 , ప్రభాత వార్త :

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కడప జిల్లా సింహాద్రిపురం మండలం రావులకొలను గ్రామంలో పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ ఎన్.వి. రమణ తన సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించి, కలయిదురు గుతూ నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను జల్లెడ పట్టారు. అనంతరం డిఎస్పి మురళి నాయక్ మాట్లాడు తూ గ్రామ ప్రజలు, వాహనదారులకు పోలీసులు పలు సూచనలు చేశారు. ఏవైనా సమస్యలు తలెత్తితే ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుతంగా పరిష్క రించుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి, పల్లెల్లో ప్రశాంతమైన వాతావరణంలో జీవనం కొనసాగించాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, రూరల్ సీఐ ఎన్.వి. రమణ, తొండూరు ఎస్సై గణ మద్దిలేటి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం..

బ్రహ్మంగారి మఠం జనవరి 20 ప్రభాత వార్త :





జగన్మాత శక్తి స్వరూపిణి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాన్ని అమ్మవారిశాల నందు అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు కార్యదర్శి సుంకు సురేష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మంగారిమఠం మండలం వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తజన భక్తజనులు పాల్గొన్నారు.ప్రాతః కాలం నుండి సుప్రభాత సేవలు గణపతి రుద్ర నవగ్రహ చండీ హోమం పూర్ణాహుతి అభిషేకాలు అమ్మవారి కుంకుమార్చన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లను ఆలయ కమిటీ వారు చేయగా భక్తులకు అమ్మవారి శాల కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు యాదల వెంకటసుబ్బయ్య,కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుంకు సురేష్ బాబు,మహిళా మండలి అధ్యక్షురాలు ముచ్చర్ల పద్మ మాజీ అధ్యక్షులు బన్నూరు కృష్ణమూర్తి, ముచ్చర్ల శేషయ్య, పత్తి సురేష్,ఆర్యవైశ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి ఆత్మార్పణ దినోత్సవం

దువ్వూరు, జనవరి 20, ప్రభాతవార్త:

స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు మంగళవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గణపతి పూజ, పుణ్య వాచనము, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పాలాభిషేకం, రుద్రాభిషేకం, మంగళ హారతి, మంత్రపుష్పము అలాగే ఆర్యవైశ్య మహిళలచే కుంకుమార్చన, దీపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి శాలకు వచ్చిన భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షులు ఆరవేటి సుబ్బారావు, లింగం పట్టాభిరామయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## మోడంపల్లె దోబీకానా విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ప్రొద్దుటూరు జనవరి 20 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని మోడంపల్లె దోబీకానాలో మున్సిపాలిటీ తరపున చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులు వెంటనే చెల్లించాలని భారతీయ జనతాపార్టీ ప్రొద్దుటూరు పట్టణ రెండవ అధ్యక్షులు పాలెం కిరణ్ కుమార్ కోరారు. మంగళవారం ఈ విషయమై ఆయన ప్రొద్దుటూరు పట్టణ రజక సంక్షేమ సేవా సంగం ఇరువురు కలిసి మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ మోడంపల్లి వీధిలోని రజకులు కులవృత్తి చేసుకునే దోబికానాలో కరెంట్ సదుపాయం కొన్ని ఏళ్లగా మన మున్సిపాలిటీ వారు బిల్లులు చెల్లించేవారని, అయితే ఈ మధ్యకాలంలో కరెంటు బిల్లు పైకాన్ని చెల్లించడము నిలిపివేశారని వివరించారు. కావున రజక కుటుంబాలు జీవనోపాధిని కోల్పోవడం జరిగిందని, ఇలా పలు సమస్యలను లెటర్ పైన వ్రాసి ఇవ్వగా ప్రొద్దుటూరు మునిసిపల్ కమిషనర్ కి ఇవ్వగా వెంటనే కమిషనర్ మునిసిపల్ ఇంజనీర్ కి ఫార్వర్డ్ చేసి తక్షణమే సమస్యను పరిష్కరించమని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బీజేపీ పట్టణ అధ్యక్షులు పాలెం కిరణ్ కుమార్, రాజకాభివృద్ది సంస్థ రాష్ట్ర కార్యదర్శి పొట్టిపాటి బాబు, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబెర్ గురు ప్రసాద్, అసెంబ్లీ కో కన్వీనర్ గౌరీశంకర్, రవి, శంకర్, గురు రాజేష్, మోడంపల్లె రజక వీర మహిళలు పాల్గొన్నారు.

## జోనల్ స్పెల్బి కి 20 మంది విద్యార్థులు ఎంపిక

పెద్దమండెం జనవరి 20 ప్రభాతవార్త



పెద్దమండె మండలం వెలిగిల్లు ఆదర్శ ప్రాథమిక పాఠశాల నుండి జోనల్ స్పెల్బీ గే పెద్దమండ మండలం నుండి 20 మంది విద్యార్థులు ఎంపిక కావడం రాష్ట్ర స్థాయిలో సంచలనమని ఇందుకు విద్యార్థుల కృషి ఎప్పటికప్పుడు సందేహాల నివృత్తి నిరంతర పర్యవేక్షణ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో సచ్చత్కారం అని ఎంఈఓ లో మనోహర్ రామకృష్ణారావ అది తెలుసుకోలేకపోవడం నిన్న వచ్చిన జోనల్ ఫలితాల్లో ఒకే పాఠశాల నుండి 20 మంది విద్యార్థులు ఎంపిక కావడం గమనార్హం అనిఅన్నారు . పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు మధుకర్ రెడ్డి ప్రోత్సాహం పర్యవేక్షణతోనే ఈ విజయాన్ని సాధించడంలో ఉపాధ్యాయులు హెచ్ఎం లక్ష్మీదేవి అభినందించారు

# సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికుల ధర్నా

రాజంపేట జనవరి 20 ప్రభాతవార్త :

వివిధ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ధర్నా అనంతరం కార్మికులు వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎస్. లక్ష్మీనారాయణకు వినతి పత్రం సమర్పించారు. ధర్నాలో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కోవిడ్ కార్మికులకు గత మూడు నెలల నుండి జీతాలు చెల్లించలేదని, క్రిస్మస్ కు, సంక్రాంతి పండుగలకు, పస్తులు ఉండాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి మున్సిపల్ కార్మికులకు, సబ్బులు, నూనెలు, షూస్, చెప్పులు, యూనిఫార్మ్స్, బ్లౌజులు, ఇలాంటి రక్షణ పరికరాలు అందించలేదని ఆరోపించారు. గత ఏడాదిలో ఇచ్చిన రైన్ కోట్స్ నాసిరకం ఇచ్చారన్నారు. అదేవిధంగా, మునిసిపల్ జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఇప్పటికే రిటైర్మెంట్ అయిన వారు, చనిపోయిన వారు 20 మంది దాకా తగ్గారన్నారు. వారి కుటుంబంలో వారికి, కోవిడ్ కార్మికులను ఆ స్థానంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ కార్మికులకు 18000 నుంచి 21,000 ఇస్తుంటే, కోవిడ్ కార్మికులకు మాత్రం 15000 చెల్లిస్తున్నారని ఇది చాలా అన్యాయం అన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఈ ఎస్ఐ, హెల్త్ కార్డులు లేక కార్మికుల ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్, జిల్లా కార్యదర్శి, పివి రమణ, కాకమూరి ప్రసాదు,ఎంవి రమణ, డి. లక్ష్మీదేవి, ఎం. మధు, సిహెచ్ నరసింహులు, బి. నర్సయ్య సుబ్రహ్మణ్యం, ధనమ్మ, కోనయ్య, జి పెంచలయ్య, ఎమ్మెస్ రాణి, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

## ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

ఒంటిమిట్ట జనవరి 20 (ప్రభాతవార్త )



ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె ఉన్నత పాఠశాల, చేనువారిపల్లె, బోయపల్లె, అచ్చంపేట ప్రాథమిక పాఠశాలలను మంగళవారం అదనపు మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మయ్య ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. మంటపంపల్లె ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజులు యాక్షన్ పరిశీలించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నాడు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒంటిమిట్టలో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ కిచెన్ షెడ్ సదుపాయాన్ని పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఆసన్నవుతున్నాయని విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని మంచి విద్యను అందించాలని విద్యార్థులకు సబ్జెక్టులలో ఏవైనా సందేహాలు వచ్చిన తక్షణమే స్పందించి నివృత్తి చేయాలన్నాడు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణం ఆదర్శనీయం

తంబళ్లపల్లె జనవరి 20 ప్రభాతవార్త ః



మండలం పరసతోపు పంచాయతీ కురువపల్లెలో నిర్మించిన సిసి రోడ్డు ఆదర్శవంతంగా ఉందని పంచాయతీరాజ్ డిఇ విజయ్ మోహన్ కొనియాడారు. మంగళవారం ఆయన సిసి రోడ్డు నిర్మాణాలు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో జరిగే సిసి రోడ్ల నిర్మాణ పనులు ఇదే స్ఫూర్తితో నాణ్యత లోపం లేకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏ ఈ రమణ, టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కాలా నారాయణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శేష వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు.

తంబళ్లపల్లె జనవరి 20 ప్రభాతవార్త ః



మండలం కోసువారిపల్లిలో వెలసిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీవారు శ్రీదేవి భూదేవి సమేతంగా ఉదయం శేష వాహనం సాయంత్రం హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆగమ శాస్త్ర ప్రకారం శాస్రోత్తకంగా స్వామివారికి టీటీడీ ప్రధాన అర్చకులు కృష్ణస్వామి, రమేష్ స్వామిల బృందం సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించి స్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా మాడవీధుల్లో శేష వాహనం పై ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని హంస వాహనంపై మంగళ వాయిద్యాలు, హరినామ సంకీర్తనలతో మాడవీధులతోపాటు కోసువారిపల్లి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, గోవింద నామస్మరణ, చెక్కభజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నగేష్, కృష్ణమూర్తి, మురళి భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు యాక్సిడెంట్ వలన ఇద్దరికీ గాయాలు

తొండూరు జనవరి 20 ప్రభాతవార్త :

తొండూరు మండలంలోని మల్లెల నుండి వెళుతున్న బోడి వారి పల్లె గ్రామానికి చెందిన లక్ష్మీ చైతన్య మరియు శివ మనోహర్ పల్సర్ బైక్ పై మల్లెల గ్రామం నుండి బోడువారిపల్లె గ్రామానికి పోతూ మల్లెల, కొరవానిపల్లె గ్రామాల మధ్య జెసిబి వాహనము పొలాల వైపు నుండి రోడ్డుమీదికి రాగా పల్సర్ బైక్ ను జెసిబి తగిలి పల్సర్ బైక్ పై వెళుతున్న లక్ష్మీ చైతన్య కు మోకాలి వద్ద రక్త గాయమైనది, శివ మనోహర్ కు చిన్న చిన్న గాయాలు అయినాయి. ప్రమాదం జరిగిన వెంటనే తొండూరు 108 వాహనము ద్వారా పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం.

## కస్తూరిబాను సందర్శించిన యంపిడిఓ

చిన్నమండెం జనవరి 20 ప్రభాత వార్త:



మండలంలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణ సందర్శించారు. అందులో భాగంగా విద్యార్థుల యొక్క సౌకర్యాలు అడిగి తెలుసుకోవడం జరిగింది అలాగే వంటగదిని మరియు స్టాక్ రూమ్ ను పరిశీలించడం జరిగింది. మరియు వంట చేస్తున్నపుడు ఎలా ఉండాలో వంట మనుషులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు.

## హుండీ ఆదాయం రూ. 7.30 లక్షలు

నందలూరు , జనవరి 20 ప్రభాతవార్త :

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథ స్వామి ఉండిని మంగళవారం లెక్కించగా 7,30,879/ రూపాయలు వచ్చినట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీ ఆదాయాన్ని 30 రోజులకు సంబంధించి లెక్కించామన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ సూపరిండెంటెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి కృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే తనయుడు

రామసముద్రం జనవరి 20 ప్రభాతవార్త



మండలంలోని మాలేనత్తం గ్రామంలో మంగళవారం జరిగిన సంక్రాంతి పండుగ ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయుడు జునైద్ అక్బరీ పాల్గొన్నారు. జునైద్‌ను మాలేనత్తం గ్రామపంచాయతీ టిడిపి యువనాయుకులు రూపేష్ రెడ్డి బానాసంచాలు కాలుస్తూ శాలువ కప్పి బొకే ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. జునైద్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు పల్లెలు పట్టు కొమ్మలని, సంక్రాంతి పండుగలో భాగమైన సంక్రాంతి రైతుల్లో ఆనందాన్ని నింపుతుందన్నారు. వేడుకల్లో పాల్గొన్నా జునైద్ అక్బరీ, బిల్డింగ్ అసోషియన్ అధ్యక్షులు షంషీర్ బాషా,పెద్దిరెడ్డి మాజీ జడ్పీటీసీ శివశంకర్, మండలమాల మహా నాడు అధ్యక్షులు టి. కృష్ణప్ప,సుధాకర్ రెడ్డి,కిషోర్, శ్రీనాథ్, వెంకటరమణ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, రవీంద్ర రెడ్డి,శ్రీనివాస రాజు, చిన్న శ్రీనివాసులు రాజు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఐదేళ్లు జైలు శిక్ష

యర్రగుంట్ల జనవరి 20 ప్రభాతవార్త :

కులం పేరుతో దూషించి దాడి చేసిన కేసులో ఒకరికి జైలు శిక్ష పడింది. యర్రగుంట్ల పట్టణంలోని ఓ బ్రాందీ షాప్ వద్ద 2019లో పెద్ద నరసింహులు అదే ప్రాంతానికి చెందిన కొప్పోళ్ళ వెంకటేష్ (39) ఆటో నడుపుతూ తనకు అడ్డు వచ్చాడని పెద్ద నరసింహులును కులం పేరుతో దూషించి దాడి చేశాడు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో 5 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1000 జరిమాణం విధిస్తూ శీదిళీగి 4 తిదీరి కోర్టు న్యాయమూర్తి జి. దీన బాబు మంగళవారం తీర్పునిచ్చారు. కేసును విజయవంతంగా నిరూపించిన యర్రగుంట్ల సీఐ విశ్వనాథ్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, వెంకటేశ్వర్ రెడ్డి, హోంగార్డ్ పుష్పరాజును జిల్లా ఎస్పీ అభినందించారు

## ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు

ఒంటిమిట్ట జనవరి 20 (ప్రభాతవార్త )



ఉన్నత స్థాయి పశు వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఒంటిమిట్ట మండలం గంగ పేరూరు పంచాయతీ ఇబ్రహీంపేట గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంగళవారం మండల స్థాయి పశు వైద్యాధికారులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమము ఒంటిమిట్ట పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని రైతుల పశువులు ,గొర్రెలు, మేకలు, కోళ్ల మొత్తం కలిపి 74 జీవాలకు వైద్యాధికారులు చికిత్స అందించారు. అనంతరం ఒంటిమిట్ట సహాయ సంచాలకులు డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండల వ్యాప్తంగా ఈనెల 19వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో ప్రభుత్వ ఉచిత పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ ఉచిత సేవలను రైతులందరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని పాడి సంపదలో పురోగతి చెందాలని ఇందుమూలంగా స్పష్టం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి ఐ ఓ రాణి, జె.వి వో లక్ష్మి, రమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతిరాజ్ డిఈపై మాజీ ఎమ్మెల్యే ఆరోపణ

మైదుకూరు, జనవరి 20, ప్రభాతవార్త:




నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎంపీ నిధుల కింద చేపట్టే పనులను పంచాయతిరాజ్ డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్ అడ్డుకొని అభివృద్ధి నిరోధకులుగా మారారని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి సంచలన ఆరోపణ చేశారు. స్థానిక పట్టణ వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ డిఈ మధుసూదన్ పై తీవ్ర ఆరోపణలు చేస్తూ గ్రామాలలో ఎంపీ నిధుల కింద కేటాయించిన రోడ్ల పనులు వైఎస్ఆర్సిపి సంబంధించిన సర్పంచ్ లు,ఎంపీపీలను పనులు చేయకుండా అభివృద్ధిని అడ్డుకున్నాడని ఆరోపణలు చేశారు. చాపాడు మండలం నక్కలదిన్నె గ్రామంలో కూడా రోడ్డు వేయకుండా అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న అభివృద్ధి నిరోధకుడని ఆయనపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇన్చార్జులు, వైఎస్ఆర్సిపి సర్పంచులు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎడిటర్‌పై దాడి చేయడం అమానుషం

పీలేరు జనవరి 20 ప్రభాతవార్త:


ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న దృశ్యం

పత్రిక సంపాదికులు ప్రభాకర్ రెడ్డిపై అల్లరి మూకలు దాడి చేయడం అమానుషమని పలు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు టిఆర్ఎస్ అమృత తేజ నరేష్ పలువురు విలేకరులతో మాట్లాడుతూ విలేకరులపై దాడి చేస్తే శిక్ష తప్పదని ఎంతటి వారినైనా జైలుకు పంపించక తప్పదని సుప్రీంకోర్టు ఆదేశాలున్న కొంతమంది సుప్రీంకోర్టు ఆదేశాలను పక్కనపెట్టి అనునిత్యం ప్రజల కోసం సమస్యలపై పోరాడే జర్నలిస్టులపై దాడులు సహజమైపోయాయని అదే విధంగా పీలేరులో ఓ పార్టీకి సంబంధించిన వ్యక్తి ప్రభాకర్ రెడ్డి పై దాడి చేసి హత్య ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అనునిత్యం రద్దీగా ఉండే పీలేరు పట్టణంలోని అల్లరి మూకలు దాడి చేసిన పలువురు ఖండించకపోవడం విస్మయం వ్యక్తం చేస్తున్నదని వారు తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు ప్రభాకర్ రెడ్డి పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి బాధ్యతలకు న్యాయం చేయకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు తెలియజేయడమే కాకుండా మరోసారి ఇలాగే జరిగితే తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు.

## పీలేరు డిపో ఆదాయం రూ.23.43 లక్షలు

పీలేరు, జనవరి 20 ప్రభాతవార్త:

సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారం పీలేరు డిపోకు రూ.23.43 లక్షల ఆదాయం వచ్చిట్లు డిపో మేనేజర్ ఎన్ఎండి. రోషన్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో పీలేరు ఆర్టీసీ డిపో పరిధిలో సోమవారం 90 సర్వీసులు 38 వేల కిలో మీటర్లు తిప్పి రూ.23.43 లక్షల ఆదాయం సాధించినట్లు తెలిపారు. ఈపీకే 61.11, ఓఆర్ 113.21 సాధించినట్లు వివరించారు. ఈపీకే, ఓఆర్ జిల్లాలో పీలేరు డిపో ప్రథమ స్థానం రావడానికి కృషి చేసిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయులు, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్, సురేష్ పాల్గొన్నారు.

## పాఠశాలలో ఇన్వర్టర్ కొరకు నగదు వితరణ

ముద్దనూరు,జనవరి 20,ప్రభాతవార్త:



జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో 1972 73 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పదవ తరగతి విద్యార్థుల తరపున అప్పటి సమయంలో ప్రధాన ఉపాధ్యాయులుగా పాఠాలు చెప్పిన శ్రీ కాళహస్తి కుమారుడు శివసుబ్రహ్మణ్యం మంగళవారం నాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓబులేష్ కు పాఠశాలలో ఇన్వర్టర్ కొరకు 26వేల రూపాయల నగదు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అన్వర్ భాష పద్మనాభరెడ్డి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అతికారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి

సిద్దవటం జనవరి 20 ప్రభాతవార్త



అతికారి వెంకటయ్య కుటుంబ సభ్యులను మంగళవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. మండలకేంద్రమైన సిద్దవటం ఆకులవీధిలో ఉండే జనసేన సీనియర్ నాయకులు అతికారి వెంకటయ్య మరణించిన విషయం తెలుసుకొని ఇంటి దగ్గరికి వెళ్లి వారి కుటుంబ సభ్యులు కుమారుడు దినేష్, సోదరుడు కృష్ణలను పరామర్శించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అతికారి చిన్న వెంకటయ్య సిద్దవటం సర్పంచ్ ప్రతినిధి భవనాసి ఓబులయ్య గాజుల ఖాదర్ బాషా ఒంటిమిట్ట సీఐ నరసింహరాజు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ గంగయ్య మహబూబ్ బాషా కూల్ డ్రింక్ షాప్ గౌస్ విజయ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 7.10 లక్షలు పలికిన తలనీలాల వేలం పాట

సిద్దవటం జనవరి 20 ప్రభాతవార్త

నిత్యపూజ స్వామి తలనీలాల వేలం పాట రూ. 7.10 లక్షలు పలికిందని ఆలయం ఈఓ శ్రీధర్ తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం రంగనాథ స్వామి ఆలయంలో మంగళవారం మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి భక్తుల తలనీలాల పోగు హక్కు కోసం బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఈ పాటలో 17 మంది పాటదారులు ఒక్కొక్కరు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. రూ. 5 లక్షలతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ జనార్ధన్, ఆలయ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, ఆలయ ఈఓ శ్రీధర్ లు ప్రారంభించారు. గుంతకల్ కు చెందిన తెల్ల మేకల చక్రధర్ రూ. 7.10 లక్షలకు పాటను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, కమిటీ సభ్యులు శివారెడ్డి, దేవాదాయశాఖ సిబ్బంది చంద్ర, పాటదారులు, ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, ప్రజలు, పాల్గొన్నారు.

## అధికారం కోల్పోయామని జీర్ణించుకోలేకనే బీసీలపై హత్యలు

సంబేపల్లి జనవరి 20 ప్రభాతవార్త



రాష్ట్రవ్యాప్తంగా బీసీ నాయకుల పై వైసీపీ నాయకులు చేసే దాడులు హేమమైన చర్య అని రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కే నాగేశ్వర్ నాయుడు అన్నారు మంగళవారం తన కార్యాలయంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్ నాయుడు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రజలు సంక్రాంతి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటుంటే వైసీపీ నేతలు ప్రశాంతమైన వాతావరణాన్ని చేరిపి ప్రజలను భయబ్రాంతులను చేసేందుకు హత్య రాజకీయాలకు పాల్పడ్డారన్నారు. తుని నియోజకవర్గం కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన టిడిపి బీసీ నేత లాలం బంగారయ్యను వైసీపీ నేతలు అతికిరాతంగా హతమార్చారన్నారు. అధికారం కోల్పోయామని జీర్ణించుకోలేకనే ఇలాంటి హత్య రాజకీయాలు రప్ప రప్ప అంటూ పిలుపునిచ్చి దాడులకు ప్రోత్సహిస్తున్నారని బడుగ బలహీనవర్గాల పై వైసీపీ నేతలు దమనకాండక పాల్పటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తెలుగుదేశం పార్టీలో బీసీలుఅంచలంచలుగా ఎదిగి గుర్తింపు తెచ్చుకుంటున్న బీసీ నేతలను అణిచివేయడమే లక్ష్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని తప్పు చేసిన వైసీపీ వారిని ఎవరిని వదిలి పెట్టేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ముత్యకార అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సంబేపల్లి గ్రామ అధ్యక్షుడు మల్లి వేణుగోపాల్ నాయుడు ఐ టి డి పి మండల కుప్పల రెడ్డప్ప పాల్గొన్నారు.

## వైసీపీ హత్య రాజకీయాలను ఖండిస్తున్నా

పీలేరు జనవరి 20 ప్రభాతవార్త:



బడుగు బలహీన వర్గాలపై వైసీపీ హత్య రాజకీయాలను ఖండిస్తున్నామని రాష్ట్ర జంగమ కార్పొరేషన్ చైర్మన్ వాసు నూరి చంద్రశేఖర్ అన్నారు. "అధికారం కోల్పోయామనే అక్కసుతో వైసీపీ నాయకులు రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు, చంద్రశేఖర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అధికారం కోల్పోయామనే అక్కసుతో వైసీపీ నాయకులు రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారు. అని వైసీపీ నేతల వైఖరిని తీవ్రంగా ఖండించారు. బీసీ నేతపై దాడి హేయమైన చర్య ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజలంతా సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటుంటే, వైసీపీ నేతలు మాత్రం హత్యా రాజకీయాలతో ప్రశాంతతను దెబ్బతీస్తున్నారు. జగన్ రెడ్డి హయాంలో జరిగిన బీసీల అణచివేతను ప్రజలు మరచిపోలేదు. ఇలాంటి కుట్రలకు కాలం చెల్లిందని వైసీపీ నేతలు గుర్తుంచుకోవాలి.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

పీలేరు , జనవరి 20 ప్రభాతవార్త:

మండలంలోని యర్రగుంట్లపల్లెలో మంగళవారం సంక్రాంతి పండుగను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం యర్రగుంట్లపల్లెలో కనుమ పండుగ నిర్వహించారు. ఉదయం ఇంటిముందు చల్లపెట్టి అనంతరం గ్రామస్తులంతా మూకుమ్మడిగా తీసుకెళ్లి గ్రామ సమీపంలో మంచినీటి చెరువుల్లో వేశారు. సాయంత్రం పశువులను రంగు రంగుల బెలూన్లు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పశువులకు పూజలు నిర్వహించి గ్రామ సమీపంలోని కాటంరాజు వద్దకు తోలుకు వెళ్లారు. కాటంరాజు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం చిట్లాకుప్పలకు నిప్పంటించి భక్తులు. ప్రజలు వీక్షించారు. చిట్లా కుప్పల చుట్టూ పశువులను ప్రదక్షిణలు చేపించారు.

## ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటించాలి

పీలేరు, జనవరి 20 ప్రభాతవార్త

సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో పయనించాలని తిరుపతి విభాగ్ సహ కార్యవాహ రెడ్డెప్ప, చిన్మయమిషన్ స్వామి శ్రీకృష్ణానంద సరస్వతి అన్నారు. మండలంలోని మండలంలోని రేగళ్ల శ్రీ సత్యమ్మ ఆలయం ప్రాంగణంలో హిందూ సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేపట్టాలని సూచించారు. మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని తెలిపారు. దేశంలో ఎన్ని కులాలు, మతాలు ఉన్నా మనమంతా ఒక్కటిగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరశర్మ, భాస్కర్స్వామి, చింతపర్తి సతీష్స్వామి. భక్తులు పాల్గొన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

ములకలచెరువు, జనవరి 20, ప్రభాతవార్త

మండలంలో చేపడుతున్న ఉచిత పశు వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం ములకలచెరువు మండలంలోని కోటపల్లి, పాతకోట గ్రామాలలో ఉచిత పశు వైద్య శిబిరాలు బురకాయలకోట అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణ్ వెంకటేష్, వైద్యాధికారి నివేదిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 49 పశువులకు చికిత్స అందించి, 159 ఆవులు దూడలు, 2442 గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు, పిడుదుల నివారణకు మందులు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆ పశువైద్యాధికారిని నివేదిత మాట్లాడుతూ ఈ నెల 31 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## లోక కల్యాణం కోసం ఆత్మార్పణం

రామసముద్రం జనవరి 20 ప్రభాతవార్త



సమాజ శ్రేయస్సు కోసం, ధర్మ రక్షణ కోసం అహింసా మార్గంలో అగ్ని ప్రవేశం చేసిన త్యాగమూర్తి శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని మాఘ శుద్ధ విదియ పురస్కరించుకుని మండల కేంద్రంలో బజారు వీధిలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస ఆచార్ అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆమె ఆత్మార్పణకు గుర్తుగా కన్యకా పరమేశ్వరి రూపంలో వెలసి నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని .అహింసా పరమోధర్మః అనే నినాదంతో సమాజ హితం కోసం ప్రాణత్యాగం చేసిన ఆమె మార్గం నేటి మహిళా సాధికారతకు, సామాజిక బాధ్యతకు దిక్సూచి అని అదనపు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ ఆర్య సంఘం అధ్యక్షులు నరసింహులు ఆర్యసంఘం మహిళా అధ్యక్షురాలు డి. సుబ్బలక్ష్మి, గబ్బురిసుదర్శన్ బాబు, వై. శ్రీనివాసులు శెట్టి, సుబ్రహ్మణ్యం శెట్టి,లక్ష్మి కాంతరాజు (చిన్ని) ,గబ్బురిమధుసూదన్,కె. మధుసూదన్,గబ్బురి జైకుమార్ ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశానానికి దారి ఏర్పాటు చేస్తాం

పోరుమామిళ్ల రూరల్, జనవరి 20 ప్రభాతవార్త:



కాశినాయన మండలం మిద్దెల ఎస్సీ కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివసిస్తున్నారు. వారిలో ఎవరైనా మరణిస్తే పంట పొలాల గట్టుమీద, నీటి గుంటల మీద వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేయడం తో పలు వార్త కథనాలు వచ్చాయి. ఈ విషయంపై టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి ఆదేశాల మేరకు బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి మండల తహసిల్దార్ వెంకటసుబ్బయ్య తో కలసి స్మశానానికి వెళ్లే దారిని పరిశీలించారు. స్మశానానికి వెళ్లే దారి గురించి విచారణ చేపట్టి వేగంగా తమకు నివేదిక అందిస్తే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తామని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అమర్నాథ్ రెడ్డి, వీఆర్వో,సర్వేయర్,టీడీపీ నాయకులు పోలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం

పోరుమామిళ్ల రూరల్, జనవరి 20 ప్రభాతవార్త:



పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉద్దికట్ట వీధిలో మంగళవారం కూలీ పనులకు వెళ్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడి, వి బి జీ రామ్ జి చట్టం కాకుండా MGNREGA చట్టాన్నే అమలు పరచెంతవరకు పోరాటం చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్వర్ వారికి పిలుపునిచ్చారు. ఈ సందర్బంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడుతూ MGNREGA చట్టాన్ని నిర్వీర్యం చేసే దిశగా మోడీ ప్రభుత్వం అడుగులు వేస్తుందని, దానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా వారి అడుగులకు మడుగులు ఒత్తుతుందని ఆయన మండిపడ్డారు. కావున ఉపాధి హామీ కూలీలు ఈ విషయాన్ని గమనించి మహాత్మా గాంధీ జాతి గ్రామీణ ఉపాధి హామీ పథకమే అమలయ్యేలా పోరాటం చేయాలని వాళ్లకు వివరించి, కర పత్రాలనుకూడా పంపిణీ చేశారు.

## ఘనంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

కలసపాడు, జనవరి 20 ప్రభాతవార్త:



స్థానిక వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ఆర్యవైశ్యులు పురవీధుల గుండా నగర సంకీర్తనలు చేశారు. అనంతరం వినాయకునికి నగరేశ్వరునికి వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకాలు నిర్వహించారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం మహిళలు లక్ష కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నివారణకు కృషి వైస్ గవర్నర్ విరూపాక్ష రెడ్డి

రాజంపేట, జనవరి 20 ప్రభాతవార్త:

లయన్స్ క్లబ్ ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ నివారణ కు కృషి చేస్తామని ప్రయత్నిస్తాం వైస్ గవర్నర్ విరూపాక్ష రెడ్డి తెలిపారు. మంగళవారం రాజంపేట లయన్స్ క్లబ్ ను 2 వ వైస్ గవర్నర్ ఆర్ వి రావుతో కలిసి విసిట్ చేసారు. వీరితో పాటు గుత్తి,గుత్తి ఫోర్ట్ ,గౌతంపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లు మహబూబ్ భాష, హనుమేష్ రెడ్డి,డాక్టర్ వెంకటేశ్వర్లు రెడ్డి,లయన్ లింగయ్య కూడా వచ్చారు. వీరికి క్లబ్ ప్రెసిడెంట్ తరిగోపుల లక్ష్మి నారాయణ మాజీ జోన్ చైర్మన్ నాసరుద్దీన్,మాజీ రీజియన్ ప్రెసిడెంట్ గీతాంజలి రమణ, మాజీ అధ్యక్షుడు డాక్టర్ నవీన్, మాజీ చైర్మన్ వెంకట సుబ్బయ్య స్వాగతం పలికారు. భవిష్యత్తులో తమ క్లబ్ ద్వారా మరిన్ని సేవలు చేసి ప్రత్యేకంగ క్యాన్సర్ ప్రివెన్షన్ కోసం తమవంతు కృషి చేసి తమ క్లబ్ ద్వారా ఇంజెక్షన్ లు కొనుగోలు చేసి మహిళలకు 80 శాతం,పురుషులకు 20 శాతం ప్రముఖ వైద్య సంస్త అయిన సీరం కంపెనీ ద్వారా వేయిస్తామన్నారు.

## ఎరువుల సమతుల్యం పాటించాలి

దువ్వూరు, జనవరి 20, ప్రభాతవార్త:




రైతులు పంటలు సాగు చేసే సమయంలో వాటికి వినియోగించే ఎరువులను సమ్మతుల్యం పాటించి ఎరువులు వినియోగిస్తే మంచి దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఇడమడక గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ యూరియా వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. భాస్వరం, పోటాష్ ఎక్కువగా వాడితే పంటల్లో రోగ నిరోధక శక్తి తగ్గి నాణ్యత, అధిక దిగుబడి వస్తుందన్నారు. రైతులు రబీలో సాగు చేసిన పంటలను ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ అధికారి మమత, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దువ్వూరు, జనవరి 20, ప్రభాతవార్త:



మండల పరిధిలోని చల్లబసాయపల్లె, గుడిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ల నందు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద 340 రూపాయలు చెల్లించి భీమా చేయించుకోవాలన్నారు. అలాగే సురక్ష బీమా యోజనలో 20 రూపాయలు చెల్లిస్తే 4 లక్షల రూపాయల ప్రమాద బీమా ఉందన్నారు. రాయలసీమ గ్రామీణ బ్యాంక్ ద్వారా అటల్ పింఛన్ పథకం కింద 60 సంవత్సరాల తర్వాత 1000 రూపాయల వరకు పింఛన్ పొందవచ్చు అన్నారు. బ్యాంకు ద్వారా గృహ రుణ, విద్యా బంగారు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే కళాజాత బృందంచే వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంతి, సుధీర్ బాబు, శివ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వాసవి మాత ఆత్మార్పణ దినం



ఒంటిమిట్ట జనవరి 20 (ప్రభాతవార్త )
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆత్మార్పణ దినం సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన ఒంటిమిట్ట మెయిన్ బజార్‌లో వెలిసిన అమ్మవారిశాలలో ఆర్యవైశ్యుల నేతృత్వంలో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు మండల పురోహితులు, శ్రీ కోదండ రామాలయ ఆస్థాన పురహితులు మరియు అమ్మవారి శాల అర్చకులు ఏలేశ్వరం. గురుస్వామి శర్మ, ఏలేశ్వరం. బాల గురునాథ శర్మ(బాలుస్వామి), రామావఝ్జల. శ్రీకాంత్ శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు ప్రత్యేకంగా అలంకారాలు అమ్మవారికి కుంకుమార్చనలు, గణపతి పూజ, స్వస్తి పుణ్యావాచనము, దీక్షాహోమం ,పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగము, నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని ఆర్య వైశ్యులందరూ పూజలకు హాజరై భక్తితో తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంకాలం ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి అష్టోత్తర, సహస్రనామ కుంకుమార్చన, దశ హారతులు, మంగళ హారతి, మంత్రపుష్పం, నిర్వహించారు. తీర్థ ప్రసాదము భక్తులకు అందించారు. పై పూజా కార్యక్రమాల్లో ఆర్య వైశ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని అర్చకులు అమ్మవారికి నిర్వహించే అభిషేకాలు హోమాలు తిలకించి అమ్మవారి ఆశీస్సులకు పాత్రులై కార్యక్రమాలను విజయవంతం చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారి నామాలు ప్రతిధ్వనించాయి.

## ప్రకృతి వ్యవసాయం జిల్లాకే ఆదర్శం

తంబళ్లపల్లె జనవరి 20 ప్రభాతవార్త :



గుండ్లపల్లి పంచాయతీలో ల్యాండ్ డెవలప్మెంట్‌తో వ్యవసాయానికి అనువుగా మార్చుకొని అందులో ప్రకృతి వ్యవసాయ పంటలు పండిస్తున్న రైతులు జిల్లాకే ఆదర్శంగా నిలిచినట్లు పోర్డు డైరెక్టర్ లలితమ్మ కొనియాడారు. మంగళవారం ఆమె గుండ్లపల్లి పంచాయతీలో ల్యాండ్ డెవలప్మెంట్లో అభివృద్ధి చేసిన పొలాలలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన వేరుశనగ, ఉలవ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. సేంద్రియ కషాయాలతో పండ్లతోటలైన మామిడి, టమోటా, కూరగాయల పంటలు పండించడం పై వారిని అభినందించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి భవిష్యత్తులో మానవాళికి ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రకృతి వ్యవసాయం అవలంబించాలని లలితమ్మ కోరారు. ఆమె వెంట సిబ్బంది రమణ, రైతులు వేట మల్లికార్జున, నరసింహప్ప నాయుడు, లక్ష్మయ్య సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయ నిధి




ప్రొద్దుటూరు జనవరి 20 ప్రభాతవార్త
రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో పేదల ఆరోగ్య కోసం సీఎం సహాయ నిధి కింద 104 మందికి మంజూరైన 35.72 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి నేటి వరకు 21 విడతలుగా సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశామన్నారు. అందులో భాగంగా 22వ విడతగా ఈ చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉండి వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక సంజీవనిలా పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో విద్య వైద్య రంగాల అభివృద్ధికి ఓటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు ప్రజల ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తూ ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



లక్కిరెడ్డిపల్లి: జనవరి 20 ప్రభాతవార్త
సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కానిస్టేబుల్ పీరమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విశ్వభారతి స్కూల్లో సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా కిషోర్ బాలికలు బ్యాడ్ టచ్ గుడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతే కాకుండా ఏదైనా మగ పిల్లవాళ్ళు ఏడిపిస్తే వెంటనే 100 కానీ పోలీసులకు వెంటనే తెలియజేయాలన్నారు. కష్టపడి చదివితే మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆమె విద్యార్థులకు సూచించారు. 8,9,10 ఇంటర్మీడియట్ తరగతుల్లో సక్రమంగా చదువుపై దృష్టి పెడితే గొప్ప ప్రయోజకులవుతారని ఆమె తెలియజేశారు. ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, వాట్సాప్, నుండి సెల్ ఫోన్లను పూర్తిస్థాయిలో దూరంగా ఉంచాలన్నారు. కష్టపడి చదివినప్పుడే పాఠశాలకు తల్లిదండ్రులకు అందరికీ మంచి పేరు వస్తుందని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చిన్నమండెం జనవరి 20 ప్రభాతవార్త :
మండలంలోని బోరెడ్డిగారిపల్లిలో మంగళవారం మంత్రి స్వగృహం నందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రజల సమస్యలు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.



## శ్రీ వాసవి మాతకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే

పీలేరు జనవరి 20 ప్రభాతవార్త:
పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి పీలేరు శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం సభ్యుల తరఫున పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవై శ్య సంఘం తరఫున ఎమ్మెల్యే ను శాలువాలతో సత్కరించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీర్వాదం అందించారు. అనంతరం ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి అధికారికంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి కరుణ కటాక్షం దీవెనలు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఇలవేల్పు దైవం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం, తన నిబద్ధతను చాటుకొందని అన్నారు. ప్రభుత్వ పరంగా కార్యక్రమం నిర్వహించడంపై ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో పరమేశ్వరి ఆత్మార్పణ దినం



నందలూరు, జనవరి 20 ప్రభాతవార్త :
మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్యుల కుల దైవం కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు మూల విరాట్ కు, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉభయ దారులుగా మిట్ట వెంకట మురళి, జ్యోతి దంపతులు వ్యవహరించారు. అనంతరం ఆలయ అర్చకులు బండ ఆత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఉబయదారులుగా వల్లంకొండు శివ కుమార్, సుజాత, పోలేపల్లి నాగేంద్ర, భాగ్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు. అనంతరం మధ్యాహ్నం ఆల్పహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు యంబులూరు నరసింహస్వామి, ఉపాధ్యక్షులు మాకం వెంకట కుమార్, సెక్రెటరీ గెలివి కుమార్,శెట్టి ఉమ్మడిశెట్టి యంబులూరు నరసింహులు, మేడ వెంకట కుమార్, మంచి కంటి నారాయణ,గెలివి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## హైందవ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

చౌడేపల్లి, జనవరి 20 ప్రభాతవార్త



ఓంశక్తి భక్తులతో ఎస్కేఆర్

హైందవ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యతని పురాతన దేవాలయాల హరిహర హనుమదీశ్వర అయ్యప్ప సాయిరాం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.కె.వెంకట్రమణారెడ్డి అన్నారు. ఎ.కొత్తకోట సమీపంలోని అగస్త్యేశ్వరస్వామిని ఆయన దర్శించుకొన్నారు. పుంగనూరు నానాసాబ్‌పేటకు చెందిన ఓంశక్తి భక్తులకు ఇరుముడులు చెల్లించుకొనే క్రమంలో దారి ఖర్చులకు గాను రూ. 50వేల వరకు వారికి సాయమందించారు. టిటిడి వారి శ్రీవాణీ ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణానికి రూ. 15నుంచి 30లక్షల వరకు మంజూరు చేస్తారన్నారు. ఇలాంటి వెసులుబాటు ఏ ముఖ్యమంత్రి చేపట్టలేదన్నారు. అదే విధంగా బోయకొండ గంగమ్మ ఆలయాన్ని చరిత్రలో నిలుపుతామన్నారు. అనంతరం క్యాలండర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యదర్శి జల్లి మనోహర్, బల్లాపురం నరేష్, జనసేన నాయకుడు హరినాథ్, ఎన్ఎస్‌పేట ఓంశక్తి భక్తజనమండలి, స్థానికులు పాల్గొన్నారు.

## ఉగాదికి 20వేల ఇండ్లు పూర్తికి లక్ష్యం

### హౌసింగ్‌శాఖ పీడి రమేష్‌రెడ్డి



మదనపల్లె, జనవరి 20 ప్రభాతవార్త :
వచ్చే ఉగాది పండగ నాటికి జిల్లాలో 20వేల ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకొన్నట్లు గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 23వేల ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. లబ్దిదారులను చైతన్యపరిచి ఇండ్ల నిర్మాణాలను వేగవంతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని మదనపల్లె, తంబళ్ళపల్లె, రాయచోటి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో పర్యటించి ఆయా మండల గృహనిర్మాణశాఖ ఏఈలతో సమావేశం నిర్వహించి ఇండ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇండ్లు నిర్మించిన లబ్దిదారులకు సకాలంలో బిల్లులు కూడా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మైనార్టీ వర్గాలకు అదనంగా రూ.50వేలు బిల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో పిఎంఎవై కింద 740ఇండ్లు మంజూరు అయ్యాయన్నారు. మదనపల్లె, పుంగనూరు, రాయచోటి, బి.కొత్తకోట మున్సిపాలిటీల్లో ఈ పథకం కింద లబ్దిదారులకు ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒకొక్క ఇంటికి రూ.2.50లక్షలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. మదనపల్లె మున్సిపాలిటిలో 176 ఇండ్లు మంజూరు అయ్యాయన్నారు. ఇండ్ల నిర్మాణానికి వేగవంతంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

యర్రగుంట్ల జనవరి 20 ప్రభాతవార్త :
ప్రయాణాల సమయంలో రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని యర్రగుంట్ల సీఐ విశ్వనాథ్ రెడ్డి సూచించారు. మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా స్థానిక ఐసిఎల్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులతో కలిసి యర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ హెల్మెట్‌లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, సీటు బెల్టు ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు.రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంటలోపు) లో ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుందని. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే రూ. 5 వేలు నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారని సిఐ ప్రజలకు వివరించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై, మద్యం తాగడం వల్ల కలిగే అనార్థాలపై పలువురు నాటక ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల ఎస్సై నాగమురళి, హనుమంతు, ఐసిఎల్ కార్మిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్ను తనకి చేసిన డిఎస్పి

పెద్దమండెం జనవరి 20 ప్రభాతవార్త



పెద్దమండెం పోలీస్ స్టేషన్లో మంగళవారం డీఎస్పీ యస్ మహేంద్ర సీఐ వెంకటేశులు పనికి చేశారు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రావణిని మండల పరిస్థితుల గురించి విచారించారు మండలంలో పరిస్థితులు సానుకూలంగానే ఉన్నట్లు ఆమె తెలిపారు అనంతరం ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆవులేకుండా చూడాలన్నారు సమస్యలతో వచ్చిన ప్రజలకు సత్వర న్యాయ పరిష్కారం చేయాలని ఎస్సైని ఆదేశించారు అనంతరం పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## రెండోరోజు ముమ్మరంగా పశువైద్య శిబిరాలు

రాజంపేట జనవరి 20 ప్రభాతవార్త



ప్రభుత్వ ఆదేశాల మేంకు రెండో రోజు మంగళవారం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పెద్ద కారంపల్లె వైద్య శిబిరంలో1146 గొర్రెలు ,మేకలకు నట్టల నివారణ మందులు ,39దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన గేదెలకు ఆవులకు 85!! రాయితీపై బీమా పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు వినియోగించుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె ప్రతాప్ మాట్లాడుతూ ఈ పశువైద్య ఈ శిబిరాలలో పశువులకు ఉచిత పశువైద్య చికిత్సలో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్.చర్లపల్లె పశువైద్యాధికారిని డాక్టర్ కే భాగ్యవతి , జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ వరదయ్య, వెటర్నరీ అసిస్టెంటెన్లు గంగరాజు ప్రియాంక, పవన్ రాజేంద్ర,హరిబాబు పాల్గొన్నారు.

## అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



బద్వేలు, జనవరి 20, ప్రభాత వార్త
నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీపీ) రీజియన్ కార్యాలయం బద్వేల్‌లో నిర్వహించిన సమావేశంలో గోపవరం మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గోపవరం మండలం ఎన్‌టీపీ అధ్యక్షులుగా మోడల్ స్కూల్ మహమ్మద్ కాలనీలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న డి. సుబ్బరాయుడును, ప్రధాన కార్యదర్శిగా ప్రాథమిక పాఠశాల ఉప్పువారిపల్లెలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కె. రవిని ఎన్నుకున్నారు. అలాగే ఆర్థిక కార్యదర్శిగా ఉన్నత పాఠశాల రాచాయపేటలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఎం. మల్లికార్జునను నియమించారు. ఈ విషయాన్ని ఎన్‌టీపీ రాష్ట్ర బాధ్యులు మానుగుంట రవిశంకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు కూరాకు రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు డి. సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి కె. రవి మాట్లాడుతూ, మండలంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. అలాగే పాఠశాలల్లో విద్యాభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని హామీ ఇచ్చారు.

## గుడ్ సమారిటన్ స్కీమ్‌పై అవగాహన కార్యక్రమం



బద్వేల్, జనవరి 20, ప్రభాతవార్త
37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా బద్వేల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం గుడ్ సమారిటన్ స్కీమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి పౌరుడు ఎలా స్పందించాలి, బాధితులకు వెంటనే సహాయం అందించాల్సిన ప్రాధాన్యత గురించి వివరించారు.ముఖ్యంగా ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో బాధితుడిని ఆసుపత్రికి తరలించే వారికి ఎలాంటి కేసులు నమోదు చేయబోమని, అలాగే గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రాణాలు నిలిపిన వారికి రూ.5,000 ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజల్లో సహాయక భావనను పెంపొందించి, ప్రమాదాల వల్ల జరిగే మరణాలను తగ్గించడమే లక్ష్యంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల పరిశీలకులు వి. శేఖర్‌రావు, బద్వేల్ అర్బన్ సీఐ లింగప్ప, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ నవీన్ కుమార్‌తో పాటు ఆసుపత్రి వైద్యులు పాల్గొని ప్రసంగించారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు.

## వాసవి అమ్మవారికి పట్టువస్త్రాలు



బద్వేలు అర్బన్, జనవరి 20, ప్రభాతవార్త :
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం బద్వేలు టీడీపీ మాజీఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి ల తరపున వాసవిమాత అమ్మవారికి పట్టు వస్త్రాలను ఎస్‌కేపీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్ని బసవయ్య, స్టేట్ ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, శివయ్య స్వామి, మాజీ అధ్యక్షులు కేవి.సుబ్బారావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ నాగరాజ, లెక్చరర్ సుబ్బారావు చేతులమీదుగా పట్టువస్త్రాలను ఆర్యవైశ్యవర్తక సంఘం కమిటి అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, సెక్రటరీ ఉరిమిశ్రీనివాసులుకు అందించారు. వారికి కమిటి సభ్యులు, అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం చిన్ని బసవయ్య మాట్లాడుతూ రాష్ట్రప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దశెట్టి వృషికేశవ గుప్తా, సముద్రాల సురేష్, జొన్నలగడ్డ సుధాకర్,తో పాటు పలువురు కమిటి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆర్డీవో కార్యాలయంలో వీఆర్‌ఏల ఐక్యవేదిక

జమ్మలమడుగు, జనవరి 20, ప్రభాతవార్త:
జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం జయరాజు అధ్యక్షతన ఐక్యవేదిక డివిజన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర అధ్యక్షులు ధైర్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కర్నూలు సురేష్, మండలాలకు సంబంధించిన అధ్యక్షులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు. కర్నూలు సురేష్ మాట్లాడుతూ ఈ ఐక్యవేదిక వీఆర్‌ఏలను చైతన్యపరచేందుకు నిర్వహించడం జరిగిందన్నారు. పేస్కేలు, నామినీ, అర్హులైన వారికి ప్రమోషన్లు సాధించుకునే దిశగా అడుగులు వేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెబాటకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## డాక్టర్లకు రోగులకు మధ్య అనుసంధానం ఉండాలి



రాయచోటి జనవరి 20 ప్రభాతవార్త
డాక్టర్లకు రోగులకు మధ్య అనుసంధానం ఉండాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఆవరణంలో ఈరోజు ఉదయం 10 గంటలకు ఆసుపత్రి అభివృద్ధి సంఘ సర్వసభ్య సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు మరియు సిబ్బంది వారు ఎనలేని శ్రమ వలన ఆసుపత్రికి మంచి పేరు వచ్చిందని ఆయన అన్నారు. ప్రతిరోజు వెయ్యి మంది రోగులకు చికిత్స అందిస్తున్న డాక్టర్లను, నర్సులను ఆయన అభినందించారు. అబా ఐడి వలన రోగికి సంబంధించిన డేటా పూర్తి ఆసుపత్రిలో అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఇదంతా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచనలతో ఆదేశాలతో జరుగుతుందని ఆయన తెలిపారు. క్రిటికల్ కేర్ యూనిట్ ను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. బ్లడ్ బ్యాంకు వారికి మా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. 24 గంటలు పవర్ మిషన్ నడిచే దానికి 350 లీటర్ల పెట్రోలను నా సొంత నిధులను సమకూర్చుతానని తెలిపారు. సిఎస్ఆర్ పండ్స్ కింద నిధులను కూడా కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ కిరణ్, ఆర్డిఓ శ్రీనివాసులు, ఆసుపత్రి కమిటీ సభ్యులు డాక్టర్లు నర్సులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## అతికారి వెంకటయ్యకు కన్నీటి వీడ్కోలు



సిద్దవటం జనవరి 20 ప్రభాతవార్త
జనసేన నాయకులు అతికారి వెంకటయ్యకు కుటుంబ సభ్యులు అతికారి కృష్ణ, అతికారి వెంకట సుబ్బయ్య, అతికారి దినేష్ లు, జనసేన, కూటమి నాయకులు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. సిద్దవటం దిగువపేట ఆకులవీధిలోని ఆయన స్వగృహం నుంచి పార్థివదేహాన్ని జనసేన అధికార ప్రతినిధి హరిప్రసాద్ సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధాతత్వ హృదయాలతో కన్నీటితో బరువెక్కిన గుండెలతో కుటుంబ సభ్యులు బంధువులు, అభిమానులు ప్రజల మధ్య అశ్రునయనాలతో తప్పదని తెలిసినా భారీ జన సందోహాల మధ్య తమ అభిమాన నాయకుడు అతికారి వెంకటయ్య తుది వీడ్కోలు పలికి అంతిమయాత్రను నిర్వహించారు. పార్థివ దేహాన్ని సమీప పెన్నానదిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్య నిర్వహణ కార్యదర్శి బాలిశెట్టి హరి ప్రసాద్ మాజీ గ్రంథాలయ చైర్మన్ రెడ్డెం వెంకటసుబ్బారెడ్డి కడప సంఘం బలిజ సంఘం అధ్యక్షులు గోపిశెట్టి నాగరాజు అడ్వకేట్ జి ఎస్ మూర్తి పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య ఏపీ పంచాయతీ రాజ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య అతికారి చిన్న వెంకటయ్య సిద్ధవటం సర్పంచ్ ప్రతినిధి భవనాసి ఓబులయ్య మహబూబ్ బాషా గంగయ్య ఆవుల నాగేంద్ర ప్రజలు కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 20, ప్రభాతవార్త :
స్థానిక మెయిన్ బజార్ లోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో మంగళవారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ మొదలుకొని అమ్మవారికి విశేషంగా గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను వేదపండితులు లోకక్యాణార్థం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమ, సుంగంధ. పూజాద్రవ్యాలను సమర్పించి భక్తిశ్రద్దలతో పూజించారు. అమ్మవారి మూలవిరాటు పంచామృతాభిషేకం, మంగళహారతులు, మంత్రపుష్పం, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య జరిగాయి. అమ్మవారి బంగారు శ్రీచక్రమేరువుకు ప్రత్యేక పూజలను చేశారు. అమ్మవారి మూలవిరాటు విశేష అభిషేకాలు చేసి వజ్ర కిరీటంతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య తన్యకలు వివిధ రకాల పూలతో నింపిన 102 గంపలను తీసుకొని పురవీధుల్లో వాసవి మాత నామస్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. అనంతరం అమ్మవారి మూల విరాట్ను పుష్పాలతో అభిషేకించారు. 102 మంది ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా లక్ష కుంకుమార్చన ఆచరించారు. పసుపు, కుంకుమ, దీపాలు, నైవేద్యంతో అమ్మవారిని అర్చించి తమను కాపాడమని శరణువేడారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభఅధ్యక్షుడు బుశెట్టి రాంమోహనరావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు. ఆర్యవైశ్య సభప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంటులో శివనగర్ కింగ్స్ జట్ ఘన విజయాలు

బద్వేల్ అర్బన్, జనవరి 20, ప్రభాతవార్త
గోపవరం ప్రాజెక్ట్ కాలనీలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ టోర్నమెంట్‌లో శివానగర్ కింగ్స్ జట్టు మరియు బిల్డింగ్స్ కాలనీ జట్టు మధ్య జరిగిన తుది పోరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. కఠినంగా సాగిన ఈ మ్యాచ్‌లో శివానగర్ కింగ్స్ జట్టు తమ ప్రతిభను చాటుకుని విజయం సాధించింది. టోర్నమెంట్‌లో అద్భుతమైన ఆటతీరుతో విజేతగా నిలిచిన శివానగర్ కింగ్స్ జట్టుకు నిర్వాహకులు మొదటి బహుమతిగా రూ.31,116 నగదు బహూకరించారు. అదే విధంగా ఫైనల్ మ్యాచ్‌లో పోటీగా ఆడిన బిల్డింగ్స్ కాలనీ జట్టు రెండవ స్థానంలో నిలిచి రూ.20,116 నగదు బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా స్థానిక యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను ప్రోత్సహించారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించే ఇలాంటి టోర్నమెంట్లు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను గ్రామస్తులు అభినందించారు.

